కలగూరగంప

# సేవక లక్షణం

'ప్రవాసి'



పాదుషా హజరత్ ఇబ్రహీమ్ ఎంతో ఉదార స్వభావుడు. ఉత్తముడు. ఆ రోజుల్లో బానిసల్ని కొనుక్కునే పద్ధతి ప్రచలితంగా వుండేది. మంత్రులు ఇబ్రహీమ్ సేవలకై ఒక బానిసను కొని తీసుకువచ్చారు.

ఇబ్రహీం ఎంతో దయతో ఆ బానిసని ప్రశ్నించాడు.

"నాయనా నీ పేరేమిటి?"

"తమరేపేరుతో పిలిస్తే అదే నాపేరు" అన్నాడు బానిస.

"బాబూ నువ్వేంతింటావు?" అని అడిగాడు పాదుషా.

"తమరేం తిండి తినిపిస్తే అదే తింటాను" అన్నాడు బానిస

"నాయనా! ఎట్టాంటి వస్త్రాలంటే నువ్విష్టపడతావు?" ప్రశ్నించారు ఇబ్రహీం.

"మీరే బట్టలు కట్టుకోవడానికి ఇస్తారో అవే నాకిష్టం" అన్నాడు బానిస.

"మరి నువ్వేం పనిచేస్తావమ్మా?" అడిగారు ఇబ్రహీం.

"తమరే పని చెప్పితే ఆ పని చేస్తాను" అన్నాడు బానిస.

"అసలు నీకేం కావాలి బాబూ" అని దయగా అడిగాడు ఆశ్చర్యంతో ఇబ్రహీమ్.

"ప్రభూ ఏలినవారి బానిసకి తన ఇష్టమేమిటి?" అని ప్రశ్నించాడు బానిస.

"బాబూ నువ్వు నాకు బానిసవికాదు ఆచార్యుడివి. ఈశ్వరసేవకులెలా వుండాలో నాకు నువ్వు కనువిప్పు చేశావు" అన్నాడు పరమానందంతో సింహాసనం నించి లేచి నిలబడి, చేతులు మోడ్చి పాదుషా ఇబ్రహీం.

"తన ఇచ్ఛ అంటూ లేకుండా సర్వస్వం పరమాత్మ ఆదేశానికి సమర్పించుకోడమే ఈశ్వర సేవకులైన సాధకుల లక్షణం" అంటుంది ప్రసిద్ధ కాశ్మీరి తాత్త్విక నగ్నయోగిని లల్లేశ్వరి.

(మిత్రులు క్యానాం భగవాన్ దాసుగారి నించి విన్న కథ)

❄

